సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.3,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.44
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.44, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,750 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.9°/20.6°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

18 మండలాల్లో వర్షం



గోరంట్ల మండలం కరావులపల్లి వద్ద పొలంలో నిలిచిన వర్షం నీరు

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 18 మండలాల పరిధిలో వర్షం కురిసింది. ఒకేరోజు 219.4 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా రొళ్ల మండలంలో 30.4 మి.మీ, బుక్కపట్నం మండలంలో 26.2 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక బత్తలపల్లి మండలంలో 24.6 మి.మీ, రొద్దం 19.4, సోమందేపల్లి 18.4, కొత్తచెరువు 15.6, గోరంట్ల 14.2, గుడిబండ 12.2, పెనుకొండ 10.6, పుట్టపర్తి 10.4, మడకశిర 8.8, అగళి 8.2, పరిగి 7.4, కనగానపల్లి 6.2, అమడగూరు 2.6, కదిరి 1.8, ధర్మవరం 1.4, నల్లమాడ మండలంలో 1.0 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాకు 'ఎల్లో అలర్ట్'
- నాలుగు రోజులూ వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల నాలుగు రోజులూ ఉమ్మడి జిల్లాకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన తెలియజేస్తూ వాతావరణశాఖ 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు విజయశంకరబాబు, జి. నారాయణ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ఈనెల 5న మంగళవారం 'పింక్ అలర్ట్' కింద ఉమ్మడి జిల్లాలో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షసూచన కూడా ఉందన్నారు. 6, 7, 8 తేదీల్లో ఎల్లో అలర్ట్ కింద మోస్తరుగా వర్షసూచన ఉన్నట్లు తెలిపారు.

'అధిక వడ్డీ' కేసులో మరో నిందితుడి అరెస్ట్



ఏ-7 నిందితుడిని మీడియాకు చూపుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: అధిక వడ్డీల కోసం శాంతినగర్‌లో రమణ అనే వ్యక్తిపై ఇంట్లో దూరి దాడి చేసిన కేసులో ఏ-7 నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతినగర్‌లో రమణ అనే వ్యక్తిపై దాడిచేసిన ఏడుగురిలో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. ప్రస్తుతం ఏ-7 నిందితుడు గుజ్జల విజయ్‌కుమార్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా అధిక వడ్డీలు పేరుతో దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే రౌడీషీట్లు తెరుస్తామని సీఐ హెచ్చరించారు.

ఇద్దరు వీఆర్‌ఓలపై సస్పెన్షన్ వేటు

రొళ్ల: పట్టపగలే మద్యం తాగి ఆ మత్తులో వీరంగం సృష్టించిన ఇద్దరు వీఆర్‌ఓలను కలెక్టర్ టీఎస్ చేతన్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏం జరిగిందంటే..

జూలై 31న సాయంత్రం రత్నగిరి వీఆర్‌ఓ నాగరాజు, గుడ్డగుర్కి వీఆర్‌ఓ రంగనాథ్ రొళ్ల కొండ గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఫూటుగా మద్యం తాగారు. సమీపంలోని ఓ టీ బంక్ వద్దకు వచ్చి.. అక్కడే ఉన్న రత్నగిరి చెందిన మాజీ ఎంపీపీ క్రిష్ణప్ప, మరో ఐదారుగురిని అసభ్యపదజాలంతో దూషించారు. ఈ తతంగాన్ని స్థానికులు కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే ప్రభుత్వ అధికారులు దిగజారి ప్రవర్తించిన తీరుపై సాక్షి వరుస కథనాలు ప్రచురించింది. దీంతో రొళ్ల తహసీల్దార్ షేక్షావలి వీఆర్‌ఓలను పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన కలెక్టర్ టీఎస్ చేతన్ వీఆర్‌ఓలిద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు. విధి నిర్వహణలో ఎవరైనా మద్యం తాగినట్లు తేలితే కఠినంగా చర్యలు తప్పవని కలెక్టర్ మరోమారు స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం కృష్ణార్పణం

పుష్ప సినిమాలో గంధపు చెక్కల స్మగ్లింగ్‌ను తలదన్నేలా రేషన్ అక్రమ బియ్యం దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. సోమందేపల్లికి చెందిన ఓ రేషన్ మాఫియా డాన్ ఏకంగా మూడు జిల్లాల్లో తన అక్రమ వ్యాపారాన్ని విస్తరించాడు. రాజకీయ నాయకులతో పాటు అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెబుతూ రూ.కోట్లు గడిస్తున్నాడు. అతని దందా విస్తృతి చూసి 'రామ' రామ..'కృష్ణ' కృష్ణ అంటూ అధికారులే నివ్వెరపోతున్నారు.

పేదల బియ్యం.. 'తమ్ముడి' భోజ్యం

- 'పుష్ప' సినిమాను తలపిస్తున్న రేషన్ బియ్యం దందా
- మూడు జిల్లాలను శాసిస్తున్న సోమందేపల్లి 'డాన్'
- రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్న వైనం
- అధికార పార్టీ అండతో ఇష్టారాజ్యం.. కన్నెత్తి చూడని అధికార గణం



సోమవారం ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్ద రేషన్ బియ్యాన్ని పట్టుకున్న దృశ్యం

ధర్మవరం: మంత్రి సవిత ప్రాతినిథ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని సోమందేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా అవతార మెత్తాడు. తొలుత పెనుకొండ నియోజకవర్గంతో మొదలు పెట్టి... ఆ తర్వాత మూడు జిల్లాలను శాసించేస్థాయికి ఎదిగాడు. ప్రతినెలా ఇతని అక్రమ సంపాదన రూ.కోటికి పైగానే ఉండటం ప్రజల్ని విస్మయానికి గురి చేస్తోంది.

రేషన్ బియ్యం దందా ఇలా..

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో సదరు మాఫియా డాన్ కొత్త పుంతలు తొక్కించాడు. ఒకేసారి పెద్ద మొత్తంలో స్టాక్ ఉంచితే అందరికీ తెలిసిపోతుందని భావించి వినూత్నంగా ప్లాన్ చేశాడు. ఒక్కో జిల్లాలో 5 లేదా 6 వరకు స్టాక్ పాయింట్లు పెట్టుకుని అర్ధరాత్రి సమయంలో రవాణా చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఒక్కో నియోజకవర్గంలోని మండలం, పట్టణాలను వేరుచేసి రిటైల్‌గా కొంత మందిని బియ్యం సేకరించేలా పురమాయించాడు. వారికి కిలో బియ్యంపై రూ.3 చొప్పున కమీషన్ ఇచ్చి సేకరిస్తాడు. వారు ఆటోలు, టాటా ఏస్ వాహనాల ద్వారా బియ్యాన్ని స్టాక్ పాయింట్ చేరుస్తారు. అక్కడి నుంచి రేషన్ మాఫియా డాన్ రాత్రి వేళ గంటల వ్యవధిలో సరిహద్దులు దాటిస్తాడు. పెద్ద పెద్ద ఐచర్ వాహనాలు, మినీ లారీలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకు తరలిస్తున్నాడు.

వ్యాపార సామ్రాజ్యం విస్తరిస్తోందిలా..

తొలుత పెనుకొండ నియోజకవర్గం నుంచి రేషన్ దందాను ప్రారంభించిన మాఫియా డాన్... ఆ తర్వాత తన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి ధర్మవరం నియోజకవర్గానికీ విస్తరించాడు. ధర్మవరానికి సమీపంలోని ఎన్‌ఎస్‌గేట్, సీకేపల్లి మండలం ప్యాదిండి, నామాల, మేడాపురం వద్ద స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశాడు. ధర్మవరం మండలంలో వివిధ రేషన్ షాపులు, ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని ఆటోల్లో స్టాక్ పాయింట్లకు తరలిస్తాడు. అలాగే అనంతపురం నగరం, రూరల్ మండలాల్లో సేకరించిన బియ్యాన్ని రాప్తాడు మండలం కందుకూరు కెనాల్‌కు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌లో నిల్వ చేస్తాడు. ఇలా నిల్వ చేసిన బియ్యాన్ని ఐచర్ వాహనాల్లో లోడ్ చేసి కర్ణాటక బంగారు పేటలోని మిల్లులకు తరలించి విక్రయిస్తాడు. సదరు మిల్లులో లావు బియ్యాన్ని సన్న బియ్యంగా ప్రాసెస్ చేసి అధిక ధరలకు ప్రజలకు మళ్లీ విక్రయిస్తారు.

మూడు జిల్లాల్లో జోరుగా వ్యాపారం

శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, అనంతపురం జిల్లా పరిధిలోని ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాలతో పాటు వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో కూడా బియ్యం డాన్ జోరుగా వ్యాపారం చేస్తున్నట్లుగా సమాచారం. ఇటీవల పులివెందులలో పట్టుబడ్డ రేషన్ బియ్యం కూడా సదరు డాన్‌వే అయినప్పటికీ బినామీల పేర్లు చేర్పించినట్లుగా సమాచారం.

అనతికాలంలోనే భారీగా అక్రమార్జన

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారంలో భారీగా అక్రమార్జన చేసినట్లు సమాచారం. ఆంధ్రాలో పేదల బియ్యాన్ని రిటైలర్ల దగ్గర రూ.18 చొప్పున కొని కర్ణాటకలో రూ.27 లెక్కన అమ్ముకుంటున్నారు. వందలాది వాహనాలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ ప్రతినెలా రూ.కోటికిపైగానే సంపాదిస్తున్నట్లు సమాచారం.

రాజకీయ ఒత్తిళ్లు

నిజాయితీ గల పోలీసు ఎవరైనా రేషన్ బియ్యం వాహనాలను పట్టుకుంటే... వెంటనే జిల్లాలోని ఓ పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధితో పాటు బీజేపీకి చెందిన జిల్లా నాయకుడు రంగ ప్రవేశం చేస్తారు. కేసులు కట్టకూడదని ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా ధర్మవరం మండలం సీతారాం పల్లి వద్ద సదరు రేషన్ మాఫియా డాన్‌కు చెందిన ఐచర్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్న విషయం తెలుసుకుని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే కేసు కట్టకూడదని పోలీసులపై సదరు నేతలు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. వాహనంలోనివి రేషన్ బియ్యం కాదని మీడియాకు చెప్పాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో సాయంత్రమైనా పోలీస్, రెవెన్యూ అధికారులు వివరాలు వెల్లడించక పోవడం గమనార్హం.

అధికారులకు మామూళ్లు

బియ్యం డాన్ రేషన్ బియ్యాన్ని వాహనాల్లో రాత్రి సమయంలోనే జిల్లా దాటిస్తుంటాడు. మూడు జిల్లాల రేషన్ బియ్యం వాహనాలు ధర్మవరం, సీకేపల్లి, సోమందేపల్లి, కియా పోలీస్‌స్టేషన్, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా వెళ్తుంటాయి. ఈ మార్గంలోని పోలీస్‌స్టేషన్లకు రేషన్ మాఫియా డాన్ ప్రతి స్టేషన్‌కు ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మామూళ్లు ముట్టజెబుతున్నాడు. ఒకవేళ సదరు స్టేషన్‌లలో పోలీస్ ఉన్నతాధికారులు లంచం తీసుకునేందుకు నిరాకరిస్తే కిందిస్థాయి సిబ్బందితోనే పని జరిపిస్తున్నాడు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన విజిలెన్స్ అధికారులు కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాకు రూ.1.80 లక్షల చొప్పున విజిలెన్స్ అధికారులు కొంతమందికి మామూళ్లు అందుతుండటంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీతారాంపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ధర్మవరం రూరల్ పోలీసులు 170.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ కేశవనాయుడు, వీఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది సోమవారం ఉదయం సీతారాంపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐచర్‌ను నిలిపి తనిఖీ చేశారు. అందులో 341 బ్యాగులు (170.50 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. వాహన డ్రైవర్ బుక్కపట్నం మండలానికి చెందిన గుజ్జల సతీష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదే విధంగా సోమందేపల్లికి చెందిన నరేష్, చెన్నేకొత్తపల్లికి చెందిన సద్దాం ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్నారని తెలిపారు.



సీకేపల్లి మండలం ఎన్‌ఎస్‌గేట్ వద్ద ఓ ధాబాలో వాహనం నుంచి రేషన్ బియ్యాన్ని స్టాక్‌పాయింట్‌కు తరలిస్తున్న దృశ్యం

టీడీపీ నేత భూదందా

- భూసేకరణ జరిగే ప్రాంతాల్లో తన భార్య పేరిట అసైన్‌మెంట్ పట్టాలు
- ఇప్పటికే రెండుచోట్ల పరిహారం కూడా పొందిన వైనం
- తాజాగా టేకులోడులోనూ బినామీల పేరుతో పట్టాలు
- మళ్లీ పరిహారం పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు



సాక్షి, టాస్క్‌ఫోర్స్: చిలమత్తూరు పంచాయతీకి చెందిన ఓ టీడీపీ నేత భూ దందాకు తెరతీశాడు. ప్రభుత్వం ఎక్కడైనా భూ సేకరణ జరుపుతున్నట్లు తెలిస్తే చాలు...అక్కడ వాలిపోతాడు. అధికారులను మచ్చిక చేసుకుని తనకు భూమి లేకపోయినా అసైన్‌మెంట్ ల్యాండ్‌కు పట్టా పొందుతాడు. ఆ తర్వాత భూమికి సంబంధించిన పరిహారం దర్జాగా తీసుకుంటాడు. ఇలా ఇప్పటికే చిలమత్తూరు పంచాయతీలోనూ తన భార్య పేరిట అసైన్‌మెంట్ పట్టా పొందాడు. ఇక లేపాక్షి నాలెడ్జి హబ్‌లోని కోడూరు పొలంలో తన భార్య పేరిటే పట్టా పొంది పరిహారం తీసుకున్నాడు. అలాగే టేకులోడు పొలంలోనూ తన భార్య పేరిటే అసైన్‌మెంట్ పట్టా పొంది పరిహారం దక్కించుకున్నాడు. తాజాగా ప్రభుత్వం టేకులోడు రెవెన్యూ గ్రామంలోనే పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ పనులు చేపట్టగా...బినామీల పేరుతో అసైన్డ్‌పట్టాలు పొందాడు. ఇప్పటికే పరిహారం కోసం వివరాలన్నీ సమర్పించాడు. నేడు, రేపో పరిహారం పొందనున్నాడు. ఈ నేపథ్యంలో సదరు టీడీపీ నేత భూ దందాపై ఇటీవలే వైఎస్సార్ సీపీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనే పరిహారం పొంది కూడా మళ్లీ భార్య పేరిట మూడుచోట్ల పట్టాలు పొందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ నేటికీ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు.

కాంట్రాక్టర్‌గా మారి నాసిరకం పనులు

ఈ తెలుగు తమ్ముడు అధికారం అండతో భూకబ్జాలే కాకుండా కాంట్రాక్టర్ అవతారమెత్తి నాసిరకంగా పనులు చేసి ప్రజా ధనాన్ని దండుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తూ, అధికారులను భయపెడుతూ హవా కొనసాగిస్తున్నాడు. సదరు నేత చేసిన కాంట్రాక్ట్ పనులు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మాతృభాషపై మమకారం ఉండాలి

- పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్ తప్పనిసరి
- కలెక్టర్ టీఎస్ చేతన్
- కేంద్రియ విద్యాలయలో తరగతులు ప్రారంభం

గోరంట్ల: పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ఇంగ్లిష్ ప్రావీణ్యం అవసరమని, కానీ మాతృభాషపై ప్రతి ఒక్కరికీ మమకారం ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం ఆయన పాలసముద్రం సమీపంలోని 'నాసిన్' సంస్థ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రియ విద్యాలయలో తరగతులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి 1 నుంచి 5 వరకు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాలసముద్రం సమీపంలో కేంద్రియ విద్యాలయను ప్రారంభించిందన్నారు. విద్యార్థులు అన్ని భాషాల్లో చక్కటి ప్రావీణ్యం పెంపొందించుకునేలా అధ్యాపకులు కృషిచేయాలన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రియ విద్యాలయ ఏర్పాటుకు గతంలో జాతీయ రహదారి ప్రక్కనే స్థలం కేటాయించామని, అయితే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాసిన్ వెనక వైపు భూమిని కేటాయించి నాసిన్ ప్రాంగణంలోనే పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో 'నాసిన్' జాయింట్ డైరెక్టర్ సత్య దివ్యరమ్య, డిప్యూటీ డైరెక్టర్ శేషు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కృష్ణారావు, గోరంట్ల తహసీల్దార్ మారుతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కేంద్రియ విద్యాలయలో తరగతి గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా అందే అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 269 అర్జీలు అందగా..వాటిని ఆయా శాఖలకు పంపారు. అత్యధికంగా పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ నుంచి 85 అర్జీలు అందగా, ఆ తర్వాత పెనుకొండ డివిజన్ నుంచి 79, ధర్మవరం డివిజన్ నుంచి 72, కదిరి డివిజన్ నుంచి 33 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. అర్జీల పరిష్కారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయి వెళ్లి విచారణ జరిపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. అనంతరం పలువురు జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ టీఎస్ చేతన్ 'మన మిత్ర' యాప్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న హర్యానా, చండీఘర్ సత్యసాయి భక్తులు

అలరించిన 'కరిష్యే వచనం తవ'

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనలు ఆచరణీయమన్న సందేశాన్నిస్తూ 'కరిష్యే వచనం తవ' పేరుతో బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన నృత్యరూపకం నయనమనోహరంగా సాగింది. పర్తియాత్రలో భాగంగా హర్యానా, చండీఘర్ రాష్ట్రాల సత్యసాయి భక్తులు సోమవారం సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 'సాయి శ్రవణ్ సుర్ సరిత' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు సత్యసాయి చాటిన సందేశాన్ని వినిపిస్తూ, 'సత్యసాయి బోధనలు ఆచరిస్తాం'' అంటూ తమ విధేయతను చాటుతూ నిర్వహించిన సంగీత నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యరూపకంలోని ఓ ఘట్టం

జల్లెడ పడుతున్నా జాడ లేదు!

- హిందూపురం బ్యాంకు దోపిడీ కేసులో కనిపించని పురోగతి
- మూడు బృందాలు గాలిస్తున్నా చిన్న క్లూ కూడా దొరకని వైనం
- చోరీల కట్టడిలో శ్రీసత్యసాయి పోలీసులు విఫలమయ్యారని విమర్శలు



దోపిడీ జరిగిన హిందూపురం ఎస్‌బీఐలో లాకర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: హిందూపురం పట్టణంలోని ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు సవాలుగా మారింది. సుమారు 11 కేజీలకు పైగా బంగారం (రూ.11 కోట్ల విలువ), రూ.30 లక్షల నగదు దోచుకుని వెళ్లి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకూ కనీసం చిన్న ఆధారాన్ని కూడా సేకరించలేక పోయారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పాటు అనంతపురం నుంచి మూడు బృందాల పోలీసులు, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి మూడు బృందాలు నాలుగు రోజులుగా జల్లెడ పడుతున్నా ఎక్కడా జాడ కూడా తెలియలేదు.

ఆనవాళ్లు దొరక్కుండా..

ఎంత తెలివైన దొంగలైనా ఎక్కడో ఒక చోట చిన్న తప్పు చేసి దొరికిపోతుంటారు. ఫింగర్ ప్రింట్స్‌లోనో, సెల్‌ఫోన్ లొకేషన్ వల్లో చిక్కేస్తుంటారు. కానీ హిందూపురం ఎస్‌బీఐ దోపిడీ ఘటనలో దొంగలు అత్యంత జాగ్రత్త పడ్డారు. నేరస్తుడు ఎలక్ట్రికల్ పనిలో నిష్ణాతుడైనట్లు తెలుస్తోంది. ఫేజ్, న్యూట్రల్, ఎర్త్, ఇన్వర్టర్ కనెక్షన్ ఇలా అన్ని వైర్లనూ చాలా జాగ్రత్తగా కట్ చేశారు. సీసీ కెమెరా కనెక్షన్ మొదట్లోనే తొలగించారు. వెంట తెచ్చుకున్న మినీ గ్యాస్ సిలిండర్ నుంచి కట్టర్‌ను ఉపయోగించి కిటికీ ఇనుప చువ్వలు కత్తిరించారు. ముఖానికి మాస్కు, కాళ్లకు సాక్సు, చేతులకు గ్లౌజులు వేసుకుని అత్యంత పకడ్బందీగా లాకర్లను కట్ చేసి 11 కేజీలకు పైగా బంగారాన్ని దోచుకెళ్లారు. ఎక్కడా వేలిముద్రలు, పాదముద్రలు పడకుండా జాగ్రత్త పడినట్టు తెలిసింది. దోపిడీకి ఇద్దరు దొంగలు మాత్రమే వచ్చినట్టు తెలుస్తోంది. ప్రధాన నిందితుడు బ్యాంకు ఆవరణలో వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించినట్టు గుర్తించారు. తెల్లవారు జామున 1 గంట నుంచి 3 గంటలలోగా దోపిడీ జరిగినట్టు పోలీసులు నిర్ధారించారు.

ఘోరంగా విఫలం..

బ్యాంకు దోపిడీ దొంగలను పట్టుకునేందుకు వారం రోజులుగా పోలీసులు జల్లెడ పడుతున్నా ఎక్కడా ఆచూకీ లేదు. ప్రధానంగా సెల్ ఫోన్ వాడటం లేదని తెలిసింది. దొంగలు ఇతర రాష్ట్రానికి చెందిన వారై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బెంగళూరు, నెల్లూరు, హైదరాబాద్‌తో పాటు అనుమానం వచ్చిన చోటల్లా గాలిస్తున్నా జాడ దొరకలేదు. పుట్టపర్తి పోలీసులకు ఈ విషయం పెద్ద సవాలుగా మారింది. ఇదే కాదు చాలాచోట్ల దొంగతనాలు జరుగుతున్నా దొంగలను పట్టుకోవడంలో శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. జిల్లాలో దొంగతనాలు ఎక్కువయ్యాయని, రికవరీలు తక్కువగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల తీరుతో సామాన్య ప్రజలకు మాత్రం ఆవేదనే మిగులుతోంది. బ్యాంకు లాకర్లలో బంగారం పెట్టినా దొంగిలిస్తుంటే ఏం చేయాలంటూ ఖాతాదారులు వాపోతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు



జయమ్మను కాపాడిన పోలీసులు

పెనుకొండ: ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన ఓ మహిళను పెనుకొండ పోలీసులు సకాలంలో కాపాడారు. వివరాలు.. రొద్దం మండలం బూదిపల్లికి చెందిన జయమ్మ కుటుంబ సమస్యలతో విసుగు చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని సోమవారం పెనుకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పీఎస్ ప్రొహిబిషనరీ ఎస్ఐ భువనేశ్వరి, ఏఎస్ఐ నాగరాజు, పీసీ రంగప్ప వెంటనే రైల్వేస్టేషన్ చేరుకుని పరిశీలించారు. ఆమె ఆచూకీ లభ్యం కాకపోడంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. స్టేషన్ సమీపంలో పట్టాల పక్కనే ఉన్న జయమ్మను గుర్తించి సర్దిచెప్పి పీఎస్‌కు పిలుచుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం జయమ్మను అప్పగించారు.

అందని సాయం.. తప్పని కష్టం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో రైతు భరోసా ద్వారా 2,79,556 మంది రైతులకు లబ్ధి
- కూటమి ప్రభుత్వంలో 14,516 మంది అన్నదాతలకు అన్యాయం
- మొదటి విడతలోనే రూ.10.16 కోట్లు నష్టపోయిన జిల్లా రైతులు



కదిరి: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరోసారి రైతులను దగా చేసింది. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలులో వివిధ కారణాలను చూపుతూ అర్హులైన రైతుల జాబితాలో భారీగా కోత విధించింది. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 2,79,556 మంది అర్హులైన రైతులుండగా 2,65,040 మందికి మాత్రమే రూ.191.45 కోట్లు జమ చేసింది. అంటే 14,516 మంది రైతులకు రూ.10.16 కోట్ల లబ్ధికి ఎగనామం పెట్టింది.

నాడు ఎగ్గొట్టి.. నేడు మెలిక పెట్టి

కేంద్రం ఇచ్చే నగదుతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన కూటమి పెద్దలు.. అధికారం చేపట్టిన తర్వాత తొలి ఏడాది 'అన్నదాత సుఖీభవ' పథకం పూర్తిగా ఎగ్గొట్టారు. ఈ లెక్కన తొలి ఏడాది జిల్లా వ్యాప్తంగా 2,79,556 మంది రైతులు రూ.559.11 కోట్లు నష్టపోయారు. 2023-24 సంవత్సరంలో అప్పటి జగన్ ప్రభుత్వం జిల్లాలో రైతు భరోసా ద్వారా 2,79,556 మందికి రూ.321.47 కోట్లను రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది.

గతంలో ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. ఇందులో 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా ఇచ్చే రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో రూ7,500 కలిపి మొత్తం 13,500 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో ఏటా నేరుగా రైతుల ఖాతాల్లో గత ప్రభుత్వం జమ చేస్తూ వచ్చింది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా భూమి ఉందా? లేదా? అని మాత్రమే పరిశీలించి 2,79,556 మంది రైతులకు ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.1767.09 కోట్ల లబ్ధి చేకూరింది.

మూడు విడతల్లో సకాలంలో జమ

జగన్ ప్రభుత్వం ఖరీఫ్ పంట వేసే ముందు ఏటా సరిగ్గా మే నెలలో 'వైఎస్సార్ రైతు భరోసా' కింద రూ7,500 ఇచ్చేది. తర్వాత అక్టోబర్‌లో ఖరీఫ్ పంట కోతతో పాటు రబీ సాగు అవసరాల కోసం రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చింది. మళ్లీ జనవరిలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు ఇలా మూడు విడతల్లో రూ13,500 చొప్పున గత ప్రభుత్వం రైతులకు నగదు రూపంలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, డా.వైఎస్సార్ ఉచిత పంటల భీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక రకాలుగా అన్నదాతను ఆర్థికంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు.

గత ప్రభుత్వంలో జిల్లాలో రైతు భరోసా లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,56,170	రూ.345.83
2020-21	2,78,337	రూ.375.75
2021-22	2,70,443	రూ.359.80
2022-23	2,68,947	రూ.364.24
2023-24	2,79,556	రూ.321.47
మొత్తం	2,79,556	రూ.1,767.09

రైతులపై ఎందుకింత పగ?



వ్యవసాయమన్నా.. రైతులన్నా చంద్రబాబుకు సరిపోదు. ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20వేలు ఇస్తానని చెప్పి తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. ఈసారి ఖరీఫ్ వేరుశనగ సాగు సమయం దాటిపోయాక కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారు. ఇందులోనూ జిల్లాలో 15 వేల మంది అర్హులైన రైతులను ఆ జాబితా నుంచి తప్పించడం దారుణం. గత ఏడాది ఇవ్వాల్సిన రూ.20 వేలతో కలిపి మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిందే.

– ఉషశ్రీ చరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

వివిధ కారణాలున్నాయి



అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వివిధ కారణాలతో సుమారు 10 వేల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తి కాకపోవడం, భూముల మ్యూటేషన్ ప్రక్రియ, ఆధార్ సీడింగ్ సరిగా లేకపోవడం తదితర కారణాలతో డబ్బు జమకాలేదు. అన్నీ సరిచేసుకుంటే సమస్య ఉండదు.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

వైభవంగా ఖాద్రీశుడి కల్యాణోత్సవం




కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగ మంటపంలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభునికి సోమవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు సంతోష్ స్వామి, మంజునాథ్ స్వామి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. హోమాలు నిర్వహించి, వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'బిల్లులు చెల్లించకపోతే ఎలా బతకాలి?'

లేపాక్షి: ఉపాధి పనులు చేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించకపోతే తామెలా బతకాలంటూ ఎంపీడీఓ నరసింహమూర్తిని లేపాక్షి మండలం మానేపల్లి పంచాయతీ గౌరిగానిపల్లికి చెందిన ఉపాధి కూలీలు నిలదీశారు. సోమవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధి కింద సోప్ పిట్ పనులు పూర్తి చేసి సుమారు ఆరు నెలలు గడుస్తోందన్నారు. ఒక్కో సోప్ పిట్ నిర్మానానికి రూ.5వేలు మంజూరు చేశారని, ఇప్పటి వరకూ ఆ బిల్లులు మంజూరు చేయలేదంటూ మండిపడ్డారు. ఇంట్లోని బంగారు నగలు కుదువ పెట్టి కేటాయించిన పని పూర్తి చేశామన్నారు. ఇప్పటికైనా తమకు బిల్లులు మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ.. బిల్లుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదికలు అందజేశామని, రాగానే కూలీల ఖ్యాతాల్లోకి జమ చేస్తామని భరోసానిచ్చారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి

కదిరి టౌన్: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఈ విషయంగా నిర్లక్ష్యం వీడాలంటూ వైద్య, ఆరోగ్య సిబ్బందిని కదిరిలోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. కాగా, ఆదివారం రాత్రి పాము కాటుకు గురైన నల్లచెరువు మండలానికి చెందిన రాజశేఖర్ నాయుడుని ఏరియా ఆస్పత్రికి తీసుకువస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఆ సమయంలో వారిపై ఎంఎల్ రామచంద్ర దురుసుగా వ్యవహరించడంతో బాధితులు దాడి చేశారు. దీంతో రామచంద్రపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఉదయం వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో సీఐ నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు.

పోక్సో కేసులో ముగ్గురి అరెస్ట్

హిందూపురం: మాయ మాటలతో మైనర్ బాలికను తీసుకెళ్లిన కేసులో ముగ్గురు యువకులను పోక్సో కేసు కింద సోమవారం అరెస్ట్ చేసినట్లు హిందూపురం రూరల్ పోలీసులు తెలిపారు. గత నెల 26న కొటిపి ఎస్సీ కాలనీకి చెందిన మైనర్ బాలికను నమ్మించి అదే ప్రాంతానికి చెందిన సతీష్, నాగరాజు, శ్రీరంగరాజుపల్లి ఫణిసింహ పిలుచుకెళ్లారన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం ముగ్గురిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, సోమవారం కిరికెర గేట్ వద్ద నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

క్రీడలు ఆడుతుండగా విరిగిన విద్యార్థిని చెయ్యి



చికిత్స పొందుతున్న విద్యార్థిని

చిలమత్తూరు(లేపాక్షి): లేపాక్షి మండలంలో కొండూరులోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం క్రీడలు ఆడుతుండగా ఆరో తరగతి విద్యార్థిని లిఖిత చెయ్యి విరిగింది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచారు. విద్యార్థిని ఇంటికి వెళ్లిన తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే చెయ్యి విరిగిన విషయాన్ని ఎవరితోనూ చెప్పరాదంటూ పీఈటీ హెచ్చరించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

పరిష్కార వేదికకు 75 వినతులు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీదేవి దంపతులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 వినతులు అందాయి. డీఎస్పీ ఆదినారాయణ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజరీ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ తెలపండి

పద్దెనిమిదేళ్ల వయసున్న తమ కుమారుడు ఓంకారేశ్వర్ కనిపించడం లేదని, అతని ఆచూకీ తెలపాలంటూ తాడిమర్రికి చెందిన లక్ష్మీదేవి, గంగాధర దంపతులు వేడుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ ఆదినారాయణకు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 16 నుంచి కుమారుడు కనిపించడం లేదన్నారు. ఇప్పటికే మూడు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ యువతి మాయ మాటలతో పిలుచుకెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. యువతిని, ఆమె తల్లిదండ్రులను విచారణ చేస్తే తమ కుమారుడి ఆచూకీ తెలుస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటూ అభ్యర్థించారు.

నేటి నుంచి 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మూడు నెలల పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరరెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ తెలిపారు. సోమవారం పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్‌లోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు మంగళవారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని చేపట్టి, ఉద్యోగుల సమస్యలపై ఆరా తీయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ప్రభుత్వం సుమారు రూ.35 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమాన్ని మూడు నెలల పాటు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర మహిళా కార్యవర్గంలోకి ఎంపికైన సాంబశివమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



పుట్టక్క (ఫైల్)

అగళి: మండలంలోని దొక్కలపల్లి గ్రామానికి చెందిన చిత్తప్ప భార్య పుట్టక్క (52) ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న పుట్టక్క కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో సోమవారం పత్తి పంటకు వినియోగించే పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కర్ణాటకలోని తుమకూరులో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె ఆస్పత్రిలో మృతిచెందారు. కుమారుడు శివలింగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీల ఢీ - ఒకరి మృతి



విడపనకల్లు: మండలంలోని గడేకల్లు వద్ద 67వ జాతీయ రహదారిపై సోమవారం రెండు లారీలు ఢీ కొన్నాయి. ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. లారీలు రెండూ పరస్పరం ఢీకొనడంతో క్యాబిన్‌లు నుజ్జునుజ్జయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కున్న హర్యానాకు చెందిన డ్రైవర్ జితేంద్రకుమార్ (35)ను స్థానికులు అతి కష్టంపై వెలికి తీసి వెనువెంటనే బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



పైపల్లి వద్ద పట్టుబడిన జూదరులతో పోలీసులు

పుట్టపర్తి అర్బన్: స్థానిక పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో 26 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారని డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. పుట్టపర్తి మండలం పైపల్లి శివారున పేకాట ఆడుతూ బత్తలపల్లి ప్రసాద్, అమగొండపాళ్యం సంతోషకుమార్, చంద్ర, పుట్టపర్తికి చెందిన వెంకటేష్, సాయినగర్‌కు చెందిన అంజినప్ప, కొత్తచెరువు మండలం కమ్మపాలెం నివాసి సాకే చిన్న తిప్పన్న, కర్ణాటక నాగేపల్లికి చెందిన సాకే శ్రీరాములు, అంజి, రవిసాయి, సాయినాథ్, సుబ్బరాయుడు, వెంగళమ్మచెరువు నివాసి నాగేంద్ర, బీడుపల్లి కుళ్లాయప్ప, పుట్టపర్తికి చెందిన బోయ సాయికృష్ణ తదితర 15 మంది పట్టుబడినట్లు వివరించారు. వీరి నుంచి రూ.2.03 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. తనిఖీల్లో కొత్తచెరువు అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ మారుతీ శంకర్, ఎస్ఐ లింగన్న, సిబ్బంది పాల్గొన్నారన్నారు. అలాగే బుక్కపట్నం మండలం మదిరేబైలు, రెడ్డిపల్లి గ్రామాల శివారున పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి, రూ.2.03 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ కడప జిల్లా పోట్లదుర్తికి చెందిన శివరామిరెడ్డి, పులివెందులలోని అహోబల్లాపురానికి చెందిన పాలకొండ్రాయుడు, ఎర్రగుంట్ల మండలం హనుమన గుత్తికి చెందిన సంతోష్‌రెడ్డి, సున్నపురాళ్లపల్లికి చెందిన ఆకుమల్ల రాజేష్, జమ్మలమడుగు మండలం గూడెం చెరువు నివాసి జమాల్ బాషా, ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీ నివాసి శ్రీనివాస్, కడపకు చెందిన షేక్ ఇలియాజ్, వేముల మండలం భూమయ్యగారిపల్లి నివాసి రామాంజనేయరెడ్డి, కమలాపురం మండలం దేవరాజుపల్లికి చెందిన నరసింహారెడ్డి, పోరుమామిళ్ల మండలం ఉద్దీకట్ల గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా, కడపలోని శంకరాపురం నివాసి శ్రీనాథ్ ఉన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య



జగదీష్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: మూడు పదుల వయసు పైబడినా పెళ్లి కాలేదన్న వేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పరమేశ్వరప్ప, రత్నమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం తల్లి, ఎనిమిదేళ్ల క్రితం తండ్రి మృతి చెందారు. అప్పటి నుంచి ముగ్గురు అన్నదమ్ములూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్దకుమారుడు వెంకటేశులకు వివాహమైంది. రెండో కుమారుడు జగదీష్ (33)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే సంబంధాలు ఏవీ కుదరకపోవడంతో ఇక తనకు పెళ్లి కాదేమోనంటూ జగదీష్ తరచూ బంధువులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు వదిన చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్ఆర్‌సీ (నోడల్ రరీసోర్స్ సెంటర్) లెవెల్‌లో జరిగిన వివిధ ఈవెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి తెలిపారు. అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించగా.. రెండు పోటీలలో ప్రథమ స్థానం, మిగిలిన రెండు పోటీలలో ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన మదీహా, సౌజన్య, తనూష, నిహారిక, సాయి శ్రీనిధి, నందినిలను అభినందించారు. 7 నుంచి కడపలో జరిగే జోనల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

రైలు పట్టాల వద్ద వ్యక్తి మృతదేహం

హిందూపురం: స్థానిక మున్సిపల్ ఎంజీఎం మైదానం పక్కన రైలు పట్టాల వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నం రైల్వే కీమెన్ గుర్తించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆకుపచ్చ, ఎర్ర గీతల ఫుల్ షర్టు, కాఫీ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని చనిపోయాడా? లేదా, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది నిర్ధారణ కావాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి

రాయదుర్గం టౌన్: పాము కాటుకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఎరికల కుమారస్వామి (66) ఆదివారం సాయంత్రం రాయదుర్గంలోని సీబీఎస్ కాలనీలో ఉన్న తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా చేతికి పాము కాటు వేసింది. నాటు వైద్యంతో నయం చేసుకునేందుకు ప్రయత్నించినా ఫలించకపోవడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి బంధువులు తరలించారు. పరిస్థితి విషమించి అదే రోజు అర్ధరాత్రి ఆయన మృతిచెందాడు. కాగా, కుమారస్వామికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.